కేపీఆర్ కాలనీ అధ్యక్షుడిగా గంగాధర్


నూతన పాలక వర్గాన్ని సన్మానిస్తున్న కాలనీవాసులు

మణికొండ: కేపీఆర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఇ.గంగాధర్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని కేపీఆర్ కాలనీ పార్కులో ఆదివారం జరిగిన సమావేశంలో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా శేషు, రాజశేఖర్, గణేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సింహ రాజారెడ్డి, ఉప కార్యదర్శులుగా లక్ష్మీనారాయణ, రాంబాబు, కోశాధికారిగా వేణులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు గంగాధర్ మాట్లాడుతూ... కాలనీ సమస్యల పరిష్కారానికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానన్నారు. ఎన్నికైన కమిటీని మాజీ కౌన్సిలర్ కె. రామకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ యాలాల నరేష్, బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు బి. రవికాంత్‌రెడ్డి, నాయకులు సిద్ధప్ప, శ్రీరాములు, రాజిరెడ్డి, మాజీ అధ్యక్షుడు రమణారెడ్డి తదితరులు అభినందించారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి


నివాళులర్పిస్తున్న నవయువ యూత్ క్లబ్ సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి: అమరవీరులు.. వారి త్యాగాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని నవయువ యూత్ క్లబ్ అధ్యక్షుడు ఏర్వ కుమారస్వామి అన్నారు. అమర వీరులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ఓల్డ్ కర్నూల్ రోడ్డు ప్రాంతంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహనీయుల త్యాగాలు యువతకు మార్గదర్శకంగా నిలవాలన్నారు. దేశభక్తి, సేవా స్ఫూర్తిని అందరూ అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి కొంపల్లి జగదీష్, ఉపాధ్యక్షుడు రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజావాణి


రాజేంద్రనగర్: జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఉప కమిషనర్ డాక్టర్ రవి కుమార్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది ప్రజావాణి కార్యక్రమానికి హాజరవుతారన్నారు. సర్కిల్ పరిధిలోని ఐదు డివిజన్లకు చెందిన ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను వారికి వివరించాలని సూచించారు. అక్కడే ఆయా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తారని వెల్లడించారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం


అత్తాపూర్: విద్యార్థులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులకు తల్లిదండ్రులు సహకరించాలని రాజేంద్రనగర్ మండల గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం అధ్యక్షుడు ఎం.ప్రభాకర్‌చారి అన్నారు. అత్తాపూర్ డివిజన్ పాండురంగానగర్‌లోని భానోదయ హై స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే, కల్చరల్ ఫెస్ట్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలంగాణ విద్యార్థి సంఘం అధ్యక్షుడు జంపాల రాజేష్, నేతలు బి.భావన, సతీష్, జి.శరవణ్‌కుమార్, భీమయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'మైనార్టీల సంక్షేమాన్ని విస్మరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం'



చార్మినార్: ముస్లిం మైనార్టీల సంక్షేమాన్ని విస్మరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయడానికి కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఎమ్మెల్సీ కవితను కోరినట్లు చార్మినార్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి మహమ్మద్ సలావుద్దీన్ లోది తెలిపారు. ఈ మేరకు ఆదివారం నాయకులు మహమ్మద్ సైపుద్దీన్ లోదితో కలిసి ఆమెతో సమావేశమైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రంజాన్ మాసం సందర్భంగా అప్పటి తమ ప్రభుత్వ హయాంలో ముస్లింలకు రంజాన్ కిట్లను అందజేశామని..నెల పూర్తయితున్నప్పటికీ ఇప్పటి వరకు పంపిణీ ఊసే లేదన్నారు. అంతేకాకుండా ముస్లిం మైనార్టీ ప్రజల అభివృద్ధి కోసం ఖర్చు చేయాల్సిన నిధులను ఇఫ్తార్ పార్టీ పేరుతో దుర్వినియోగం చేయడం సరైనది కాదనే విషయాన్ని ఆమెతో తెలియజేశామన్నారు.

విలీన గ్రామాల్లో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. పట్టణ ప్రణాళికా విభాగం పట్టుబిగించకపోవడంతో ఈ పరిస్థితులు నెలకొంటున్నాయి. శంషాబాద్ మున్సిపాలిటీలో సమీపంలోని గ్రామ పంచాయతీలు విలీనమై ఆరు నెలలు కావస్తున్నా టౌన్ ప్లానింగ్ విభాగం ఏమాత్రం పట్టు సాధించకపోవడంతో ఎలాంటి అనుమతులు లేని అక్రమ నిర్మాణాల తీరు ఇష్టారాజ్యంగా మారుతోంది.
–శంషాబాద్


ఘాన్సిమియాగూడలో అక్రమంగా నిర్మిస్తున్న ఓ షెడ్డు

యథేచ్ఛగా

అక్రమ నిర్మాణాలు

విలీన గ్రామాల్లో ఇష్టారాజ్యంగా అక్రమాలు

- పట్టించుకోని పట్టణ ప్రణాళికావిభాగం
- శంషాబాద్ మున్సిపాలిటీలో గ్రామాలు విలీనమై ఆరు నెలలు

విలీన గ్రామాల్లో...

- శంషాబాద్ మున్సిపాలిటీలో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు గతేడాది సెప్టెంబర్ 23న సమీపంలోని చిన్నగోల్కొండ, పెద్దగోల్కొండ, హమీదుల్లానగర్, రషీద్‌గూడ, ఘాన్సిమియాగూడ, బహదూర్‌గూడ గ్రామ పంచాయతీల రికార్డులను అధికారికంగా మున్సిపల్ కమిషనర్ బి.సుమన్‌రావు తదితరులు స్వాధీనం చేసుకున్నారు. అక్కడ ఉన్న పంచాయతీ కార్యాలయాలకు పురపాలక బోర్డులు కూడా అదే రోజు ఏర్పాటు చేసి పురపాలక సంఘం నుంచి అన్ని కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు.
- తాజాగా నెల క్రితం శంకాపూర్ గ్రామాన్ని కూడా మున్సిపాలిటీలో విలీనం చేశారు. ఔటర్‌కు అత్యంత సమీపంలోనే ఉన్న ఈ గ్రామాల్లో ఇటీవల గోదాములు, షెడ్లతో పాటు కన్వెన్షన్‌ల నిర్మాణాలు ఊపందుకున్నాయి.
- విలీనమైన గ్రామాలన్నీ జీవో 111 పరిధిలో ఉండటంతో ఇక్కడ సాధారణ గృహ నిర్మాణాలకు సైతం అనుమతి లేదు. అయినా అక్రమార్కులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

అసైన్డు భూముల్లో...

మున్సిపాలిటీలో విలీనమైన ఘాంసిమియాగూడలో ఏకంగా అక్రమార్కులు కొందరు ఏకంగా గతంలో ప్రభుత్వం వ్యవసాయం చేసుకుని బతకడానికిచ్చిన అసైన్డు పొలాను దొడ్డిదారిన కొనుగోలు చేయడంతో పాటు అందులో కన్వెన్షన్‌లు, గోదాల నిర్మాణాలు చేపడుతున్నారు. అసైన్డు స్థలాల క్రయ విక్రయాలు చట్టబద్ధంగా చెల్లనప్పటికీ అక్రమార్కులు మాత్రం ఇంటి నంబర్ల ద్వారా రిజిస్ట్రేషన్‌లు చేయించుకోవడంతో పాటు ఎలాంటి నిబంధనలు లేకుండా నిర్మాణాలు చేపడుతున్న తీరు ఇప్పుడు చర్చనీయాంశంగా మారుతోంది.


పెద్దగోల్కొండలో...

ఎందుకంటే..?

- విలీన గ్రామాల్లో పరిపాలన మున్సిపాలిటీ ఆధీనంలో ఉన్నా సంబంధిత గ్రామాల్లో ఉన్న పంచాయతీ కార్యదర్శులు అన్ని తామై వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. సంబంధిత గ్రామాల్లో ఇప్పటివరకు టౌన్‌ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణ లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. విలీన గ్రామాలపై మున్సిపాలిటీ ఉన్నతాధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారా..? అనే ప్రశ్నలు సర్వత్రా తలెత్తుతున్నాయి.
- ప్రస్తుతం టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఇన్‌చార్జి టౌన్‌ప్లానింగ్ అధికారితో పాటు మరో ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు, ఇద్దరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులున్నారు. ఇటీవల ప్రభుత్వ నియామకాల్లో వచ్చిన మరికొందరు ఉద్యోగులను కూడా ఈ విభాగంలో చేర్చి పట్టణ ప్రణాళికా విభాగాన్ని పటిష్టం చేసి మున్సిపాలిటీల్లో అన్ని ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలను నియంత్రించాలనే వాదనలు వినిపిస్తున్నాయి.
- వ్యవసాయ ఆధారిత భూముల్లో అడ్డగోలుగా జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై ఆరోపణలతో పాటు ఫిర్యాదు వెల్లువెత్తుతున్నా పట్టించుకోకపోవడంతోపై స్థానికంగా విమర్శలూ లేకపోలేదు.

బీజేపీని మరింత బలోపేతం చేస్తాం


రాజగోపాల్‌గౌడ్‌ను సన్మానిస్తున్న మైలార్‌దేవ్‌పల్లి, పిల్లోనిగూడ నాయకులు

మైలార్‌దేవ్‌పల్లి: రంగారెడ్డి రూరల్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన పంతంగి రాజగోపాల్‌గౌడ్‌ను బీజేపీ నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర ఓబీసీ మోర్చా నాయకులు, వరంగల్ జిల్లా ఇన్‌చార్జి అడికే రాజు ఆధ్వర్యంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీజేపీ నాయకులు ఆయనను కలిసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. రాబోయే రోజుల్లో బీజేపీ రంగారెడ్డి జిల్లాలో మంచి భవిష్యత్తు ఉందని రాజగోపాల్‌గౌడ్ అన్నారు. సీనియర్ నాయకులు అందర్నీ కలుపుకొని పార్టీని జిల్లాలో మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు. నేతలు అడికే మహేందర్, చేడం వెంకటరమణగుప్తా, గూడూరు అంజి, మహేష్, జయరాం, అంకిత్, చింటూరెడ్డి, ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సన్మానం...

శంషాబాద్ రూరల్: బీజేపీ రంగారెడ్డి రూరల్ జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపాల్ గౌడ్‌ను మండలంలోని పిల్లోనిగూడ పార్టీ నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. గ్రామీణ ప్రాంతంలో పార్టీ బలోపేతానికి అందరం కృషి చేయాలని రాజ్‌భూపాల్‌గౌడ్ ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పి.యాదగిరి, ఎం.యాదగిరి, కె.రమేష్, టి.రమేష్, ఎన్.సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్


ఇఫ్తార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి: మత సామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ విందులు నిలుస్తాయని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. మధుబన్, టీఎన్‌జీవోస్ ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఇఫ్తార్ విందులను ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అన్వర్, టి.ప్రేమ్‌గౌడ్, అతాహుల్లా, మధుబన్ కాలనీ అధ్యక్షుడు డి.వి.కుమార్, బాస శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా లక్ష్మణ్ గుప్తా

గౌలిపురా: హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ తొమ్మిదవ కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం వేములవాడలోని రాజరాజేశ్వర స్వామి ఆలయం సన్నిధిలో నిర్వహించారు. ఈ సమావేశంలో సరాబు లక్ష్మణ్ గుప్తాను హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా మరోసారి కొనసాగించాలని మాజీ అధ్యక్షుడు రెడ్డిశెట్టి చంద్రశేఖరరావు ప్రతిపాదించగా.. మాజీ అధ్యక్షులు కాశెట్టి పాండు, ఐపీపీ మ్యాడం దయాకర్ గుప్తా బలపరిచారు. రాబోయే రెండు సంవత్సరాలకు హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా లక్ష్మణ్‌గుప్తా కొనసాగుతారని సభలో కార్యవర్గం మొత్తం ఆమోదించింది. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ పరిధిలోని లాల్‌దర్వాజా, గౌలిపురా మండల ఆర్యవైశ్య సంఘానికి మార్చి 20న సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నికైన శ్రీరాం కోటయ్యను హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభలో అధ్యక్షుడిగా ప్రకటించారు.

సమస్యలతో సతమతం

- రహీంపురా వ్యాయామశాలలో మౌలిక వసతుల కరువు
- ఇబ్బందులు పడుతున్న యువకులు


రహీంపుర ఆట స్థలంలో వ్యాయామశాల భవనం

జియాగూడ: రహీంపురా లాల్ బహదూర్ ఆట స్థలంలో ఉన్న వ్యాయామశాల సమస్యలతో పోటీపడుతోంది. సుమారు 40 ఏళ్ల క్రితం యూత్ కోసం వ్యాయామశాల భవనం నిర్మించి అప్పట్లో అన్ని సౌకర్యాలు కల్పించింది. ప్రత్యేకంగా వ్యాయామ శిక్షకుడిని నియమించగా ఎంతో మంది క్రీడాకారులు నేర్చుకొని కుస్తీ పోటీల్లో జాతీయ స్థాయిలో రాణించారు. వ్యాయామశాలలో శిక్షణ పొందిన వారు జాతీయ స్థాయిలో పోటీపడుతున్నప్పటికీ సమస్యలు నెలకొన్నాయి. ప్రతిరోజూ సుమారు 60 మందికి పైగా చిన్నారులు, యువకులు కుస్తీలు నేర్చుకోవడానికి వస్తుంటారు. ఇందుకు కావాల్సిన మ్యాట్ కవర్లు (గద్దీలు) సరిపోయే విధంగా లేకపోవడంతో కుస్తీలు నేర్చుకునే సమయంలో వారు కిందపడి గాయాలపాలవుతున్నారు. అలాగే వ్యాయామం చేసే సామగ్రి కూడా తక్కువగా ఉండడంతో ఒకే సమయంలో అందరు చేయడానికి చాలా సమయం పడుతుంది. ఉదయం వేళల్లో చేయాల్సిన వ్యాయామం సరిపడా సామగ్రి లేక చాలా మంది వెనుదిరుగుతున్నారు. ఇక 60 మంది యువకులు ప్రతిరోజు కుస్తీ శిక్షణలకు, వ్యాయామం కోసం వస్తున్నప్పటికీ బాత్‌రూమ్ టాయిలెట్స్ లేకపోవడం మరో సమస్య ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలి.

ఇంకుడు గుంతలతో ఇంటి కిందే జలసిరి

- ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం
- ఏర్పాటు చేసుకుంటేనే భూగర్భ జలాల వృద్ధి
- స్పీడ్ ఎన్‌జీఓ అధ్యక్షుడు నందీశ్వర్‌గౌడ్


ఇంకుడు గుంతలపై అవగాహన కల్పిస్తున్న స్పీడ్ ఎన్‌జీఓ అధ్యక్షుడు

మణికొండ: పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా నీటి వనరులు పెరగటం లేదని, వాటిని మనమే ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకుని పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పీడ్ ఎన్‌జీఓ అధ్యక్షుడు నందీశ్వర్‌గౌడ్ అన్నారు. ఆదివారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని వైఎస్సార్ సెక్రటేరియట్ కాలనీలో నీటి వాడకం–పొదుపు, ఇంకుడు గుంతల ఏర్పాటు ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇప్పటికే మున్సిపాలిటీల్లో బోరు నీరు వెయ్యి అడుగులకంటే కిందకు వెళ్లిపోయిందన్నారు. ప్రతి కాలనీలో నీటి నిలువ ట్యాంకులు ఎంతో అవసరమో అదే స్థాయిలో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భూగర్భ జలాలు వేగంగా కిందకు వెళ్లిపోతున్నాయన్నారు. ఇంకుడు గుంతలతో అవి పెరిగే అవకాశం ఉంటుంద్నారు. రూ. 10 వేలతో ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంటుందని ప్రతి ఒక్కరు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కాలనీ సభ్యులు సత్యనారాయణ, నాగేంద్రప్రసాద్, పరమేశ్వర్, మహబూబ్‌బాషా, రాజేష్‌కుమార్‌లతో పాటు కాలనీ వాసులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహిస్తే అద్భుతాలు

మణికొండ మున్సిపల్ మాజీ చైర్మన్ నరేందర్ ముదిరాజ్


విజేతలకు బహుమతులను అందజేస్తున్న నరేందర్ ముదిరాజ్

మణికొండ: క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని.. అప్పుడే వారు అద్భుతాలను చేయగలరని మణికొండ మున్సిపల్ మాజీ చైర్మన్ కె. నరేందర్ ముదిరాజ్ అన్నారు. ఆదివారం అలకాపూర్ టౌన్‌షిప్ సెక్టార్ బీ కమ్యూనిటీ హాల్ గ్రౌండ్‌లో ఎంబీసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాల, బాలికల మెగా జూనియర్ బ్యాడ్మింటన్ టోర్నీని నిర్వహించారు. ఆ టోర్నీలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ఆయన బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా నరేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ... క్రీడలు శారీరక దారుఢ్యం పెంచటంతో పాటు స్నేహ సంబంధాలను పెంపొందిస్తాయన్నారు. చిన్న వయసు నుంచే పిల్లలను ఆటలలో రాణించేలా తర్ఫీదు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. చదువులతో పాటు రాబోయే రోజుల్లో ఆటలకు అనేక అవకాశాలు ఉంటాయన్నారు. ఇలాంటి టోర్నమెంట్‌లను మూడు సంవత్సరాలుగా నిర్వహించి బాల, బాలికలను ప్రోత్సహించిన ఎంబీసీ అధ్యక్షుడు, కేపీఆర్ కాలనీ మాజీ అధ్యక్షుడు ఇంద్రారెడ్డిని ఆయన అభినందించారు. క్రీడలలో రాణించిన బాలబాలికలకు నగదు పురస్కారాలతో పాటు మెమొంటోలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కె.లక్ష్మీనారాయణ, ఎంబీసీ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు హన్మంత్‌రావు, వలంటీర్లు వెంకట్, జీబీ రెడ్డి, మధు, శ్రీధర్, ఈశ్వర, నవీన్, సంతు, సూరిలతో పాటు క్రీడాకారులు పాల్గొన్నారు.

'వన్ నేషన్-వన్ ఎలక్షన్'పై అవగాహన కల్పించాలి



రాయదుర్గం: ప్రజల్లో 'వన్ నేషన్- వన్ ఎలక్షన్' అంశంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని బీజేపీ వన్ నేషన్- వన్ ఎలక్షన్ రంగారెడ్డి అర్బన్ జిల్లా కన్వీనర్ బి.అశోక్ సూచించారు. నానక్‌రాంగూడలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం గచ్చిబౌలి డివిజన్ నాయకులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలు వేర్వేరుగా నిర్వహించడం వల్ల ఖర్చు పెరుగుతోందని అందుకే దేశవ్యాప్తంగా పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలను ఒకేసారి నిర్వహిస్తే ఎన్నికల నిర్వహణ వ్యయం గణనీయంగా తగ్గుతుందని వివరించారు. ఒకేసారి ఎన్నికలు ముగిస్తే ప్రభుత్వాలు పూర్తి స్థాయిలో పాలనపై దృష్టి కేంద్రీకరించడానికి అవకాశం కలుగుతుందన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీజేపీ గెలుపే లక్ష్యంగా సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలు, నాయకులకు సముచిత స్థానం కల్పించే పార్టీ బీజేపీయేనని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్టీ గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షుడు శివాసింగ్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, బబ్లూసింగ్, కిషన్, గోపాల్, ఉమేష్, సంకేష్‌సింగ్, సతీష్‌సింగ్, హర్పాల్‌సింగ్, విశ్వనాథ్, ఉదయలక్ష్మీ, కవిత తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

గోల్కొండ: విద్యుత్‌శాఖ అధికారులు ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన టోలీచౌకీ మేరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో విద్యుత్‌శాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అకాల వర్షాలు, ఈదురుగాలలు వీచినప్పుడు అధికారులు స్వయంగా అప్రమత్తమై క్షేత్రస్థాయి సిబ్బందిని కూడా అప్రమత్తం చేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో విద్యుత్ సరఫరా, విద్యుత్ తీగల పరివర్తన తదితర వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. అంతేకాకుండా విద్యుత్ సరఫరాలో ఎక్కువగా అవంతారాలు రాకుండా చూడాలని ఆయన కోరారు. గత కొన్ని రోజులుగా తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయాల గురించి తనకు ఫిర్యాదులు వస్తున్నాయని ఆయన అన్నారు. అంతేకాకుండా మినీ ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు జరగకపోవడం లాంటి సమస్యలు పునరావృతం కాకుండా చూడాలని ఆయన అన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది ఎప్పుడూ కార్యాలయంలో అందుబాటులో ఉండి అత్యవసర సేవలకు వెంటనే రంగంలోకి దిగాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ఏడీఈ ఎ.మాధవరావు, ఏఈ ఆపరేషన్స్ మహ్మద్ జాఫర్ తదితరులు ఉన్నారు.

వీధి కుక్కల దాడిలో బాలుడికి గాయాలు


బాలుడిపై దాడి చేస్తున్న వీధి కుక్కలు

బండ్లగూడ: ఓ బాలుడిపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయ పరిచిన సంఘటన బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మెడిసిటీ కాలనీలో చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కాలనీకి చెందిన దీక్షిత్(05) ఆదివారం ఉదయం కాలనీలో నడిచి వెళ్తుండగా ఒక్కసారిగా గుంపుగా వచ్చిన వీధి కుక్కలు అతడిపై దాడి చేశాయి. దీనిని గుర్తించిన స్థానికులు కుక్కలను తరిమికొట్టి బాలుడిని రక్షించారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన దీక్షిత్‌ను అతడి కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

వైభవంగా మల్లన్న స్వామి కల్యాణోత్సవం


మల్లన్న కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

దర్శించుకున్న హరియాణా గవర్నర్ దత్తాత్రేయ

మణికొండ: ఒగ్గు కళాకారుల ఆట, పాటల మధ్య మణికొండ మల్లన్న స్వామి కల్యాణోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. మల్లన్న స్వామిని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కురుమలు, గొల్లలు ఐక్యమత్యంగా ఉండి అన్ని రంగాలలో రాణించేందుకు కృషి చేయాలన్నారు. మణికొండ మల్లన్న, బీరప్ప దేవాలయం ఆవరణలో సదనం నిర్మించటం శుభ సూచకమన్నారు. ఉదయం గ్రామం నుంచి గంపలతో భక్తులు దేవాలయానికి చేరుకున్నారు. అనంతరం కొట్నం, మల్లన్న స్వామి కల్యాణాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం, అగ్నిగుండాలు తొక్కటం, సదర్‌పటం, సాయంత్రం ఎల్లమ్మ బోనాలు, రాత్రికి ఒగ్గు కథను నిర్వహించారు. మల్లన్న కల్యాణోత్సవంలో ఆంధ్రప్రదేశ్‌లోని కనిగిరి మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌యాదవ్, బీఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ ఇంచార్జి పి.కార్తీక్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్, మాజీ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల అధ్యక్షులు బి.రవికాంత్‌రెడ్డి, డి.సీతారాం, ఎం.జితేందర్, గండిపేట మండల కురుమ సంఘం అధ్యక్షుడు యాదయ్య, మణికొండ కురుమ సంఘం చైర్మన్ బి. జైహింద్‌రావు, అధ్యక్షుడు బి.ముత్యాలు, ప్రధాన కార్యదర్శి డి.లక్ష్మణ్‌లతో పాటు మాజీ కౌన్సిలర్‌లు, నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

